# డిగ్నిటీ ఆఫ్ లేబర్

ఆదిబాబు ఎనిమిదేళ్ల బాలకార్మికుడు. ఒక సైకిల్ షాపులో గాలి కొడుతూంటాడు. ఒక చక్రానికి పదిపైసలు చొప్పున వచ్చే ఆదాయమే వాడిది. షాపు యజమాని రెండుపూటలా టీ ఇస్తాడు. అంతే. చదువుకునే వయసులో ఆర్థిక పుష్టిచాలక, ఇన్ని గంజినీళ్లయినా పొయ్యవచ్చునీ సైకిల్ షాపులో పనికి కుదిర్చింది వాళ్లమ్మ.

నేనలా చూస్తుండగానే ఆదిబాబు ఇరవైఐదేళ్ల యువకుడైపోయేడు. సైకిల్మరమ్మత్తులు బాగా నేర్చేసేడు. ఎవరో పిల్లనిచ్చి ఐదు సైకిళ్లు కొనిచ్చేరు. తను వేరే సైకిల్ షాపు పెట్టుకుని ఆ ఐదు సైకిళ్లూ అద్దెకిచ్చుకుంటూ, స్వతంత్ర జీవనుడైపోయేడు. తన దగ్గర ఇప్పుడు మరో బాల కార్మికుడు చేరేడు.

ఒకనాడు పదిగంటలకు ఆఫీసుకెళ్లే వేళకి, నా సైకిల్లో గాలి తగ్గిపోయింది.

“ఏంవోయ్ ఆదిబాబూ! గాలికొడతావా?” అనడిగేను.

“కుర్రాడు రాలేద్సార్!” అంటూ ఓ బొక్కికుర్చీలో కూర్చొని కాళ్లూపుతూ అన్నాడు.

“పోనీ నువ్వు కొట్టకూడదుటోయ్?’ అన్నాను.

“నానెలా కొడ్తానండీ నానిప్పుడు ప్రొ ప్రయిటర్ని కదా?”.

నేను డంగయిపోయేను! నిన్నకాక మొన్నటివరకూ ముక్కుచీదడం కూడారాక, మూతి అంతకీ రాసేసుకునేవాడే!? మొలతాడులోంచి లాగు జారి పోతుంటే, ఎగదోసుకుంటూ వుండేవాడే? వీడప్పుడే ప్రొప్రయిటరా?

అవొచ్చు. తప్పులేదు. జీవితంలో ఉన్నతస్థానాలకు వెళ్లాలని మనకెలా వుంటుందో, వాడికీ అలాగే ఉంటుంది. అంతమాత్రంచేత మనం ఏ స్థాయినుండి పైకొచ్చేమో అన్న విషయం మర్చిపోవడ మేనా?

సరే.. నాకు ఆఫీసుకి టైమైపోయింది కదా అని ఓ ఫర్లాంగు దూరంలో ఉన్న వేలుపిళ్లే సైకిల్ షాపు కెళ్లేను. వేలుపిళ్లే తమిళ తంబి. అతని దగ్గర కూడా పనికుర్రాడు

లేడు. "కుర్రాడు ఇల్లేసార్".

అంటాడనుకున్నాను. కాని అతనలా అన్లేదు.

"రాండిసార్ నేను కొడతాను గాలి" అంటూ గాలికొట్టేడు.

సుప్రసిద్ధ కార్టూనిస్టు "బాపు" ఓ మాటు ఓ కార్టూన్ వేసేరు. టెన్సింగ్ నార్కే అనే భారతీయుడు హిమాలయ శిఖరాన్ని ప్రథమంగా అధిరోహించి, భారత జాతీయ పతాకను ఎగరేసేడు. "అమ్మయ్య! అందరికంటే ముందు ఈ శిఖరం అధిరోహించేను" అంటూ చతికిలబడగానే.. "వేడివేడి ఇడ్లీ సాంబారు కావాలాసార్?" అని అడిగేడట ఓ తమిళ సోదరుడు. అంటే టెన్సింగ్ కంటే ముందే హిమాలయ శిఖరం మీద కాఫీక్లబ్బు పెట్టేసేడన్నమాట ఆ మహానుభావుడు.

ఇదీ.. మనవాడికీ తమిళ సోదరుడికీ తేడా. తమిళ సోదరుడెప్పుడూ చిన్నతనం ఫీలవడు. కాఫీక్లబ్‌లో సర్వరుగా చేరి ప్రొప్రయిటరుగా ఎదిగిపోయినా. తన దగ్గర పనివాళ్లు రాకపోతే, తానే స్వయంగా సప్లయి చేసేస్తాడు. గాంధీ మహాత్ముడు దక్షిణాఫ్రికాలో ఉన్నప్పుడు, తన మలమూత్రాదులను తానే స్వయంగా మట్టితో కప్పేసేవారు. మహాత్ముడు చెప్పిన "డిగ్నిటీ ఆఫ్ లేబర్" తమిళ సోదరులు పూర్తిగా పాటిస్తారు. కష్టించి పనిచేస్తారు అందుకే "అరవచాకిరీ" అనే మాట ఉద్భవించింది.

"తెలుగు చాకిరీ" అనే మాట ఉద్భవించే మంచిరోజు ఎప్పుడైనా వస్తుందంటారా?

3-7-92

"ఆంధ్రభూమి" దినపత్రిక